

నేటి రాత్రి నుంచి శ్రీవారి నిజరూప దర్శనం

ద్వారకాతిరుమల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సర్వాభరణ భూషితుడై గర్భాలయంలో ద్విమూర్తులుగా కొలువుతీరిన శ్రీవేంకటేశ్వరస్వామి వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం రాత్రి నుంచి నిజరూపంలో దర్శనం ఇవ్వనున్నారు. ఏడాదికోమారు ఏ ఆభరణాలు, పుష్పాలు, ఇతర అలంకారాలు లేకుండా స్వామి దర్శనం ఇవ్వడం సంప్రదాయం. నేతి దీపపు కాంతుల నడుమ విరాజిల్లే స్వామిని తనివితీరా దర్శించేందుకు ప్రతి భక్తుడు ఉవ్విళ్లూరుతారు. గురువారం రాత్రి ఏడు గంటల నుంచి ముక్కోటి ఏకాదశి రోజు సాయంత్రం వరకూ ఈ దర్శనం లభిస్తుంది.

నేడు చిన వెంకన్న గిరి ప్రదక్షిణ

రేపు ఉత్తరద్వారంలో శ్రీవారి దర్శనం

కాళ్లకూరు వెంకన్న ఆలయంలో ఏర్పాట్లు -6లో



7

తప్పుడు వార్తల జగన్ మీడియాపై అంధుల నిరసన

ఏలూరులో కలెక్టరేట్ వద్ద నినాదాలు

ఎకో సెన్సిటివ్ జోన్ వద్దు



- ఏర్పాటు చేస్తే ఇబ్బందులు
- కొల్లేరు రైతుల వ్యతిరేకత
- ఆకివీడులో ప్రజాభిప్రాయ సేకరణలో బైఠాయింపు
- సమస్యల ఏకరువు.. గత పరిహారం ఇవ్వలేదని వెల్లడి
- కలెక్టర్‌కు నివేదిస్తాం : అధికారులు

ఆకివీడు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటు చేస్తే భార్యాభర్తలు కలిసి జీవించడానికి అనుమతులు పొందాల్సిన పరిస్థితులు ఏర్పడతాయని కొల్లేరు రైతులు ఎద్దేవా చేశారు. కొల్లేరు అభయారణ్య ప్రతిపాదిత సున్నిత పర్యావరణ ప్రాంతంపై ఆకివీడు తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ప్రజా అవగాహన సదస్సు జరిగింది. కొల్లేరు రైతులు నేల మీద భైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ఎకో సెన్సిటివ్ జోన్ పరిధి బౌండరీ నుంచి పది కిలోమీటర్లు అంటున్నారు. అంటే ఇది ఉండి, కాళ్ల మండలాల వరకు వెళ్లిపోతుంది. ఆకివీడు రైల్వేస్టేషన్‌తోపాటు అన్నీ ఈ పరిధిలోకి వస్తాయి. ఇదే జరిగే మా మనుగడే ప్రమాదంలో పడిపోతుంది' అంటూ జోన్‌ను వ్యతిరేకిస్తూ అధికారులకు వినతిపత్రం అందజేశారు. అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ పెదకాపవరం, చినకాపవరం, తరటావ, గుమ్ములూరు, సిద్ధాపురం, కోళ్ళపర్రు, ధర్మాపురం, దుంపగడప, ఆకివీడు, మాదివాడ, అజ్జమూరు, కుప్పనపూడి, అయి-భీమవరం, చెరుకుమిల్లి రెవెన్యూ గ్రామాలు ఈ పరిధిలోకి వస్తాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు, జనజీవనానికి ఆటంకం కలుగకుండా ఉండేందుకు ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నట్టు తెలిపారు. ఈ నివేదికను కలెక్టర్‌కు నివేదిస్తామని చెప్పారు. కైకలూరు అటవీ క్షేత్రాధికారి కేవీ రామలింగాచారి, సెక్షన్ అధికారులు శ్రీనివాసబాబు, సుజాత, నరసింహారావు, తహసీల్దార్ నందూరి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో డి.సుహాసిని, ఎస్‌ఐ హనుమంతు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాభిప్రాయ సేకరణలో అధికారుల ముందు బైఠాయించిన కొల్లేరు రైతులు

జోన్‌తో అభివృద్ధి ఉండదు



- ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటుతో అభివృద్ధి ఉండదు. పరిశ్రమలకు అనుమతులు రావు. కొల్లేరు పరిధిలో ఇప్పటికే మూడు, ఐదు కాంటూరుతోనే ఇబ్బందులు పడుతున్నాం. ఇప్పుడు మరింత ఇక్కట్లు తప్పవు. భార్యాభర్తలు కలిసి ఉండడానికి అనుమతులు తీసుకోవాల్సి వస్తుంది.

\- భూపతిరాజు తిమ్మరాజు, కొల్లేరు రైతు సంఘ ప్రతినిధి

వలసలు మొదలవుతాయి



- కొల్లేరును ఐదు నుంచి మూడో కాంటూరుకు కుదించాలి. ఇప్పటికే రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. జోన్ ఏర్పాటు చేస్తే మరిన్ని ఇబ్బందులు తప్పవు. అధికారుల కనుసన్నల్లో బతకాల్సి వస్తుంది. ఇప్పటికే అనేకమంది వలస వెళ్లిపోయారు. ఇప్పుడున్న వాళ్ల అదేదారి పడతారు.

\- బొల్లా వెంకట్రావు, రైతు, ఆకివీడు

ఉపాధి కోల్పోతాం



- జోన్ ఏర్పాటుతో ఉపాధి కోల్పోతారు. ఇల్లు కట్టుకోవాలన్నా, చెట్లు కొట్టుకోవాలన్నా అధికారుల అనుమతులు తీసుకోవాలి. రహదారుల నిర్మాణాలు చేపట్టాలన్నా వారి చుట్టూ తిరగాలి. కాంటూరు పరిరక్షణకు మరో పది కిలోమీటర్ల మేర ఎకో సెన్సిటివ్ జోన్ ఏర్పాటుతో ఉండి, కాళ్ళ మండలాలు ఈ పరిధిలోకి వస్తుండడంతో ప్రశ్నార్థకం కానుంది.

\- మోటుపల్లి రామవరప్రసాద్, రైతు, ఆకివీడు

పిల్లలకు పెళ్లిళ్లు జరగవు



- గతంలో జిరాయితీ, సొసైటీ భూములను బాంబులతో పేల్చేయడంతో మా పొలాలు ఎక్కడున్నాయో తెల్సుకోలేక భూములు నష్టపోయాం. ఇప్పటి వరకూ వీటికి ఒక పైసా నష్టపరిహారం చెల్లించలేదు. కాంటూరు గుర్తించినప్పుడు మా గ్రామాల్లో పిల్లల పెళ్లిళ్ల సమస్యగా మారింది. ఇప్పుడు జోన్ ఏర్పాటు చేస్తే ఇక పిల్లలకు పెళ్లిళ్ల జరగవు.

\- జేకే రాజు, రైతు, సిద్ధాపురం

318 గ్రామసభలు 4,560 దరఖాస్తులు

1,229 పరిష్కారం.. 3,331 పెండింగ్

ముగిసిన రెవెన్యూ సదస్సులు : కలెక్టర్ నాగరాణి



భీమవరం టౌన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 27 రోజులపాటు 318 గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో 4,560 అర్జీలను స్వీకరించినట్లు జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. గత నెల 13 నుంచి ఈ నెల ఎనిమిదో తేదీ వరకు జరిగిన సదస్సుల్లో 1,229 అర్జీలను పరిష్కరించాం. మిగిలిన 3,331 దరఖాస్తులను 45 రోజుల్లోగా వీటిని పరిష్కరిస్తాం. కాని పక్షంలో లిఖిత పూర్వకంగా తెలియజేస్తాం. మండలాల వారీగా ఆకివీడు 151, భీమవరం 270, గణపవరం 194 కాళ్ల 98, పాలకోడేరు 194, ఉండి 150, వీరవాసరం 276, ఆచంట 159, యలమంచిలి 448, మొగల్తూరు 215, నరసాపురం 441, పాలకొల్లు 155, పెనుగొండ 247, పెనుమంట్ర 204, పోడూరు 210, అత్తిలి 129, పెంటపాడు 127, ఇరగవరం 192, తాడేపల్లిగూడెం 526, తణుకు 172 అర్జీలను స్వీకరించినట్లు తెలిపారు. జిల్లాలో జలశక్తి అభియాన్ కింద చేప ట్టిన జల సంరక్షణ ప్రాజెక్టు పనుల పురోగతి సంతృప్తికరంగా ఉందని సెంట్రల్ నోడల్ అధికారి డాక్టర్ జితేంద్రసింగ్, సైంటిస్టు మౌనిక సింగ్ తెలిపారు. కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. నిషేధిత భూముల జాబితాలో నుంచి తొలగించిన భూములు చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ అయ్యాయా లేదా పరిశీలించాలని సీసీఎల్‌ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయలక్ష్మి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

ఎవరికెంత..?

- కోడి పందేల బరులకు వాటాల కోసం ఒప్పందాలు



భీమవరం క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి):కోడి పందేల కోసం ఉరకలు వేస్తు న్నారు. జిల్లాలో భీమవరం, నర్సాపురం, ఆకివీడు, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల్లో పెద్ద బరుల కోసం వాటాలు సమకూర్చుకున్నట్లు సమాచారం. రోజుకు ఎన్ని పందేలు జరిగితే.. ఆ మేరకు వచ్చిన సొమ్మును సమానంగా పంచుకోవాలని నిర్ణయిం చారు. కొందరు అధికారులు, నాయకులకు ఇవ్వాల్సిన మామూళ్లపైన చర్చలు జరిపారు. బరుల వద్ద కోడి పకోడి, బిర్యాని, కూల్ డ్రింకులు, మద్యం విక్రయాలకు కేటాయింపులు జరిగాయి. ఏ బరుల వద్ద ఎన్ని దుకాణాలు ఉండాలి, వాటికి రోజుకు ఎంత చెల్లించాలనేది తేల్చేశారు. గుండాట, కోతాటల ధరలు నిర్ణయించారు. భీమవరం, ఉండి, ఆకివీడు, మొగల్తూరు మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో నెల ముందు నుంచి కోడి పందేలు నిర్వహిస్తున్నారు. రోజుకో ప్రాంతాన్ని ఎంపికచేసుకుని పందేలు నిర్వహిస్తున్నారు. గంట ముందు వాట్సప్ గ్రూపుల ద్వారా మెస్సేజ్‌లు పెడు తున్నారు. పందేలు, జూదాలు నిర్వహిస్తే కఠినచర్యలు ఉంటాయని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, కలెక్టర్ నాగరాణి హెచ్చరించారు. అయినా జూదగాళ్ళు, నిర్వాహకులు వెనక్కు తగ్గడం లేదు.

మహదేవపట్నంలో భారీ పందేలు

ఉండి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మహదేవపట్నంలో బుధవారం రాత్రి భారీస్థాయిలో కోడి పందేలు నిర్వహించారు. ఇతర ప్రాంతాలకు చెందిన వారు పెద్ద సంఖ్యలో వచ్చి లక్షల్లో పందేలు కాశారు. విషయం తెలుసుకున్న పందెం రాయుళ్లు చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలివచ్చారు. పోలీసులు పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు.

పనుల్లో అలసత్వం తగదు



7

మాట్లాడుతున్న ఎంపీ పుట్టా, చిత్రంలో జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, నరసాపురం ఎమ్మెల్యే నాయకర్

- అధికారుల తీరుపై జడ్పీ స్థాయీ సంఘాల సమావేశాల్లో ఎమ్మెల్యేల అసంతృప్తి

చెత్త కొండలు

- పట్టణాల్లో గుట్టల్లా పేరుకుపోతున్నాయి..
- డంపింగ్ యార్డుల సమస్యతో సతమతం
- ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడే డంపింగ్..
- వెంటాడుతున్న కార్మికుల కొరత

6





దాళ్వా ప్రణాళిక

దాళ్వాలో అన్ని శాఖల నుంచి ప్రణాళిక సిద్ధమైంది. వ్యవసాయ, నీటిపారుదల శాఖల తోపాటు బ్యాంకర్లు రైతులకు సహకారం, ప్రోత్సాహం ఇచ్చే దిశగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో సార్వా పంట మాసూళ్లు అల్పపీడనాల కారణంగా ఆలస్యమైనప్పటికి రెండు లక్షల 25 వేల ఎకరాల్లో దాళ్వా సాగవుతోంది. ఇప్పటికే నారుమడులు, నాట్లు చురుగ్గా సాగుతున్నాయి. నెలాఖరులోపు పూర్తిస్థాయిలో నాట్లు వేస్తారు. నీటి సంఘాల రాకతో రైతుల్లో ఉత్సాహం నెలకొంది.

- జిల్లాలో 2.25 లక్షల ఎకరాల్లో సాగు
- 86 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు
- రూ.4,500 కోట్ల వ్యవసాయ రుణాలు
- గోదావరి నుంచి 6500 క్యూసెక్కులు

భీమవరం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సార్వాకంటే దాళ్వా లోనే ఎరువుల వినియోగం ఎక్కువ. ఈ మేకు జిల్లాలో సాగు చేస్తున్న రెండు లక్షల 25 వేల ఎకరాలకు 86 వేల మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ, ఇతర రకాల ఎరువులను అధికారులు సిద్ధం చేశారు. వీటిలో 50 శాతం ప్రైవేట్ వ్యాపారుల వద్ద, 50 శాతం సహకార బ్యాంకులు, రైతు సేవా కేంద్రాల్లోను అందుబాటులో ఉంచారు. దాళ్వాలో నీటి ఇబ్బందులు రాకుండా అధికారులు ప్రణాళిక రూపొందించారు. గోదావరి నుంచి 41 టీఎంసీలు, సీలేరు నుంచి 60 టీఎంసీలను ఉపయోగించాలని నిర్ణయించారు. ప్రస్తుతం గోదావరి నుంచి రోజుకు 6,500

మిగతా 8వ పేజీలో

సిద్ధం చేశామన్న అధికారులు

- 'దాళ్వా సాగు ముందస్తు నాట్లు వేసేలా రైతులకు సూచించాం. నెలాఖరుకు అన్ని ప్రాంతాల్లోనూ నాట్లు పూర్తవుతాయి. సాగుకు కావాల్సిన ఎరువులు సిద్ధంగా ఉంచిన'ట్లు జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వర్లు చెబుతున్నారు.
- 'అన్ని బ్యాంకుల్లోను దాళ్వాలో వ్యవసాయ రుణాలు రూ.4,005 కోట్లు ఇవ్వాలని నిర్ణయించాం. 46 వేల కౌలు రైతులను అర్హులుగా గుర్తించాం. సార్వాలో 9 వేల మందికి ఇవ్వగా, మిగిలిన వారికి దాళ్వాలో ఇస్తాం' అని లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్రప్రసాద్ తెలిపారు.
- 'దాళ్వాలో సాగు నీరు సరిపడగా అందించే ఏర్పాట్లు చేశాం. ప్రస్తుతం రోజుకు 6,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నాం. వంతుల వారీ విధానం ఉంటుంది. ఎక్కడా ఏ ఇబ్బందులు రాకుండా ప్రణాళికగా సాగునీరు అందిస్తున్నాం' అని నీటిపారుదల శాఖ ఈఈ నాగార్జునరావు తెలిపారు.



హెచ్‌ఎంపీవీ వైరస్‌పై అప్రమత్తం

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో 22 పడకలతో ప్రత్యేక విభాగం ఏర్పాటు

ఏలూరు క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఎంపీవీ వైరస్ బాధితుల కోసం ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ముందస్తుగా ఐసోలేషన్ వార్డులను, చికిత్స విభాగాలను ఏర్పాటుచేశారు. 22 పడకలను సిద్ధం చేశారు. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఈ వైరస్‌పై ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావొద్దన్నారు. సాధారణ సీజనల్ వ్యాధుల్లానే ఈ వైరస్ ఉంటుందని, వైద్యులను సంప్రదించి తగిన చికిత్స పొందాలని సూచించారు. ఆస్పత్రిలో ఈ వార్డుల్లో విద్యుత్, నీటి సరఫరా, శానిటేషన్, రోగులకు అవసరమైతే ముందస్తుగా ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్ ఏర్పాటు చేశామన్నారు. 24 గంటలు వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటారని, పది వేల లీటర్ల లిక్విడ్ ఆక్సిజన్ సిద్ధంగా ఉంచామన్నారు. మరో 100 ఆక్సిజన్ సిలిండర్లు, వెంటిలేటర్లను అందుబాటులో ఉంచామన్నారు. ల్యాబ్‌లో పరీక్షలు నిమిత్తం ఆర్టీపీసీఆర్ మిషన్ ఉందని, కిట్స్ త్వరలోనే వస్తాయని తెలిపారు. ఈ వైరస్ లక్షణాలపై ఏ మాత్రం అనుమానం ఉన్నా తక్షణం ఆసుపత్రికి రావాలని కోరారు.

పెరిగిన వేగం



నరసాపురం-విజయవాడ డబ్లింగ్‌తో తీరిన రైలు ప్రయాణికుల కష్టాలు

- విశాఖ నుంచి వర్చువల్‌గా ప్రారంభించిన ప్రధాని మోదీ

1827లో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం నరసాపురం-విజయవాడ రైలు మార్గాన్ని నిర్మించింది. 1962లో దీన్ని మీటర్ గ్రేజ్ నుంచి బ్రాడ్ గేజ్ అభివృద్ధి చేశారు. సింగిల్ లైన్ కావడంతో అడుగడుగునా క్రాసింగ్‌లతోప్రయాణం నరకంగా ఉండేది. ఈ మార్గంలో 139 కిలోమీటర్ల ప్రయాణానికి ఐదు గంటలు పట్టేది. రూ.4,600 కోట్లతో 2015లో డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులు ప్రారంభించి 2022లో పూర్తి చేశారు. బ్రిటిష్ కాలం నాటి భవనాలు తొలగించి కొత్త స్టేషన్లు కట్టించారు. పనులు పూర్తయి రెండేళ్లు గడిచినా నేటికి ప్రారంభించలేదు. రాకపోకలు సాగుతున్నాయి. బుధవారం విశాఖ వచ్చిన ప్రధాని మోదీ అక్కడి నుంచి వర్చువల్‌గా ఈ డబ్లింగ్ పనులను ప్రారంభించారు.

నరసాపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): విజయవాడ-గుడివాడ-మచిలీపట్నం, గుడివాడ-భీమవరం, భీమవరం-నిడదవోలు, భీమవరం-నరసాపురం ఇలా నాలుగు ప్యాకేజీలుగా విభజించి పనులు పూర్తిచేశారు. భీమవరం నుంచి నిడదవోలు వెళ్లే మార్గాన్ని మెయిన్‌లైన్‌కు అనుసంధానం చేశారు. ఈ కారణంగా విజయవాడ నుంచి విశాఖ, కోల్‌కతా వెళ్లే రూట్‌కు ఈ మార్గం అనుసంధానమైంది. దీంతో విజయవాడ నుంచి భీమవరం, నిడదవోలు మీదుగా విశాఖ వైపు రైళ్లు దూసుకుపోతున్నాయి. గతంలో ఈ మార్గంలో గూడ్స్ రైళ్లు నడిచేవి కావు. కేవలం ఏలూరు నిడదవోలు మెయిన్ లైన్‌లో నడిచేవి. డబ్లింగ్ పెరగడంతో గూడ్స్ ట్రాఫిక్ పెరిగింది. విజయ వాడ నుంచి భీమవరం, నిడదవోలు మీదుగా మెయిన్‌లైన్‌లో గూడ్స్ రైళ్లను ఎక్కువ సంఖ్యలో నడుపుతున్నారు. దీనివల్ల మెయిన్ లైన్‌లో నడిచే ప్రధాన రైళ్లకు ట్రాఫిక్ ఇబ్బందులతోపాటు గూడ్స్ రైళ్ల సమస్య కనిపించడం లేదు. డబ్లింగ్ కావడంతో ఈ రూట్‌లో ట్రాఫిక్ పెరి గింది. హైదరాబాద్, కాకినాడ, విశాఖ, కోల్‌కతా, ఒడిశా వంటి ప్రాంతాలకు నడిచే ప్రధాన ఎక్స్‌ప్రెస్‌లు, ప్రత్యేక రైళ్లను ఈ రూట్‌లోనే నడుపుతున్నారు. ఇటు జిల్లాకు నరసాపురానికి కొత్త రైళ్లు వచ్చాయి. అందులో అమరావతి, విజయ వాడ, గుంటూరులకు డెమో రైళ్లు వచ్చాయి. గతంలో విజయవాడకు నామమాత్రంగా రైళ్లు ఉండేవి. నేడు ఈ సంఖ్య పెరిగింది.



ప్రారంభోత్సవం చేస్తున్న ప్రధాని మోదీ, చిత్రంలో గవర్నర్, సీఎం చంద్రబాబు, కేంద్ర, రాష్ట్ర మంత్రులు

త్వరలో వందే భారత్

డబ్లింగ్, విద్యుద్దీకరణ పనులతో ఈ మార్గంలో వందే భారత్ దూసుకురానుంది. చెన్నై-విజయవాడ మధ్య నడుస్తున్న వందే భారత్‌ను త్వరలో భీమవరం వరకు పొడిగించనున్నారు. నరసాపురం నుంచి బెంగళూరుకు స్లీపర్ అమృత్‌భారత్ నడిపే ప్రతిపాదన పరిశీలనలో ఉంది. నరసాపురం నుంచి వారణాశికి కొత్త రైలును ప్రవేశపెట్టాలని ప్రతిపాదన వుంది. ప్రస్తుతం విశాఖ నుంచి నడుపుతున్న ఈ రైలును త్వరలో నరసాపురం వరకు పొడిగించే ఆలోచనలో రైల్వే అధికారులు ఉన్నారు.

అమృత్ భారత్ స్టేషన్లు

డబ్లింగ్‌తో విజయవాడ డివిజన్‌లో జిల్లా రైల్వేస్టేషన్ల ప్రాధాన్యత పెరిగింది. ఆక్వా వంటి మత్స్య సంపద, బియ్యం ఎగుమతులతో రైల్వేకు ఎక్కువ ఆదాయం లభిస్తోంది. ప్రయాణీకుల సంఖ్య పెరగడంతో స్టేషన్లను మరింతగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. భీమవరం టౌన్, నరసాపురం, తాడేపల్లిగూడెం వంటి స్టేషన్లు మొదటి విడతలోనే అమృత్ భారత్‌కు ఎంపికయ్యాయి. ఈ మూడు పట్టణాల్లో రూ.80 కోట్లతో ఆధునిక హంగులతో స్టేషన్లను నిర్మిస్తున్నారు. పనులు చివరిలో ఉన్నాయి.

ఎన్‌హెచ్ 365 రోడ్డు శంకుస్థాపన వాయిదా

జీలుగుమిల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి):జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ వరకు నిర్మించే జాతీయ రహదారి 365 బీటీ రోడ్డు శంకుస్థాపన బుధవారం వాయిదాపడింది. ఈ పనులను ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం విశాఖ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేయాల్సి వుంది. ఆ తర్వాత జీలుగుమిల్లిలో ఎంపీ పుట్టా మహేశ్‌యాదవ్, ఎమ్మెల్యే చిర్రి బాలరాజు కలిసి ఈ రోడ్డుకు శంకుస్థాపన చేయాలి. ప్రజా ప్రతినిధులకు సమయాభావం కారణంగా వాయిదా పడినట్టు ఎన్‌హెచ్ ఏఈ కాజా చెప్పారు.

నాలుగు రైళ్ల రాకపోకలు రద్దు

ఏలూరు క్రైం, జనవరి 8(ఆంధ్రజ్యోతి):రైళ్ల రాకపోకల రద్దీని నియంత్రించే ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన పనుల నేపథ్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో నాలుగు రైళ్లను రద్దు చేస్తున్నట్లు రైల్వే శాఖ ఒక ప్రకటనలో తెలిపారు. 17267 కాకినాడ పోర్టు నుంచి విశాఖ, 17268 విశాఖ-కాకినాడ పోర్టు, 17239 గుంటూరు-విశాఖ నడిచే రైళ్లను ఈ నెల 11న, 17240 విశాఖ - గుంటూరు ఈ రైలును 12న రద్దు చేసినట్లు పేర్కొంది.

ఆంధ్రజ్యోతి పరిశీలన

పట్టణాలను చెత్త సమస్య పట్టి పీడిస్తోంది.. ప్రధానంగా డంపింగ్ యార్డులు లేకపోవడంతో చెత్తను ఎక్కడ పడితే అక్కడ పడేస్తున్నారు. కొన్ని మునిసిపాలిటీల్లో పారిశుధ్య సిబ్బంది కొరత వెంటాడుతోంది. తగినంత మంది కార్మికులు లేకపోవడంతో చెత్త సేకరణ సంపూర్తిగా జరగడం లేదు..పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సిబ్బందిని పెంచాలి.. చెత్త ఎక్కడ పడితే అక్కడ పడేయకుండా డంపింగ్ యార్డుల ఏర్పాటుపై దృష్టి పెట్టాలి..


భీమవరం శివారులో పేరుకుపోయిన చెత్త

చెత్త కొండలు


గూడెం మైక్రో ఇరిగేషన్ చెరువు ప్రాంతంలో చెత్తగుట్ట

పట్టణాల్లో పేరుకుపోతున్న చెత్త
కొన్నిచోట్ల డంపింగ్ యార్డుల సమస్య
ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడే డంపింగ్..
వెంటాడుతున్న కార్మికుల కొరత


కూరగాయలు మార్కెట్ వద్ద పేరుకుపోయిన చెత్త

తణుకులో కార్మికుల కొరతతో సతమతం

తణుకు : పట్టణంలోని పలు వార్డుల్లో చెత్త సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య కార్మికులు సరిపడ లేకపోవడం వల్లే సమస్య ఉత్పన్న అవుతుంది. తణుకు పట్టణంలో 34 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డులను 72 జోన్లుగా విభజించారు. ఆయా జోన్‌లకు సంబంధించి చెత్త సేకరించేందుకు కార్మికులను కేటాయించారు. అధికారిక గణాంకాలు ప్రకారం సుమారు 207 మంది కార్మికుల అవసరం ఉంటుంది. కానీ 170 మంది కార్మికులు మాత్రమే పని చేస్తున్నారు. వీరిలో కనీసం పదిమంది వరకు సెలవుల్లో ఉంటారు. అదీకాకుండా ట్రాక్టర్ల డ్రైవర్లు, కార్యాలయంలో పనిచేసేవారు, వాటర్ సెక్షన్‌లో పనిచేసే వారు కూడా ఇందులోనే ఉంటారు. పట్టణంలోని ప్రతి రోజు 60 టన్నులు వరకు చెత్త వస్తుంది. చెత్త సేకరణకు ఏడు ట్రాక్టర్లు, 25 క్లాప్ ఆటోలు ఉన్నాయి. క్లాప్ ఆటోలో పనిచేసేవారి కాంట్రాక్టు ఫిబ్రవరితో గడువు ముగిసిపోతుంది. ఆయా ఆటోల నిర్వహణ, జీత భత్యాలుకు నెలకు 14 లక్షలు మున్సిపాల్టి చెల్లిస్తుంది.క్లాప్ ఆటోల నిర్వహణకు వైసీపీ ప్రభుత్వం చెత్త పన్ను వసూలు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చెత్త పన్ను రద్దు చేయ డంతో మున్సిపాల్టిపై భారం పడింది. పారిశుధ్య కార్మికులను నియమించు కునేందుకు కలెక్టరు అనుమతి ఇచ్చారు. రోజుకు రూ. 500 వేతనం ఇచ్చేం దుకు రెండు సార్లు టెండర్లు పిలిచినా స్పందన లేదు.

త్వరలోనే సమస్య పరిష్కారం



కార్మికుల కోసం ఇప్పటికే రెండు సార్లు టెండర్లు పిలిచాం. ఎవరూ ముందుకు రావడం లేదు. ప్రత్యామ్నాయంగా పక్క మున్సిపాల్టీ నుంచి కార్మికులను తీసుకొచ్చే ఆలోచన చేస్తున్నాం. పదిహేను రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుంది.

- టి.రామ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్

• ఏపీ నిట్ పరిసరాల్లో డంపింగ్



తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెంలో రోజురోజుకు చెత్త విపరీతంగా పెరిగిపోవడంతో పజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలో సుమారు 1.20 లక్షల మంది జనాభా ఉన్నారు. పారిశుద్య కార్మికులు 271 మంది ఉన్నారు. వీరిలో పర్మినెంట్ 68 మంది కాగా ఔట్‌సర్సింగ్ 203 మంది ఉన్నారు. పట్టణంలో ప్రతీ రోజు నగటున 85 టన్నుల చెత్త బయటకు వస్తున్నట్లు అంచనా. సేకరించిన చెత్తను మైక్రో ఇరిగేషన్ చెరువు గట్టు వద్ద వేస్తున్నారు. ప్రస్తుతం పట్టణానికి ఈ ప్రాంతాన్నే డంపింగ్ యార్డ్‌గా వినియోగిస్తున్నారు. దీంతో ఈ ప్రాంతంలో చెత్త గుట్టలుగా పేరుకుపోయింది. వాస్తవానికి పట్టణంలో జనాభాకు సరిపడా పారిశుధ్య కార్మికులు లేరు. ప్రస్తుతం ఉన్న వారితో పాటు అదనంగా మరో 50 మందికి పైగా అవసరం ఉంది. ఉన్న కార్మికులతో ప్రతీరోజు పట్టణంలో చెత్త సేకరణ చేయడం అధికారులకు భారంగా మారింది. పట్టణంలో ప్రతిష్టాత్మకమైన ఏపీ నిట్ పరిసరాలు కూడా చెత్తకుప్పలకు నిలయాలుగా మారిపోయాయి.జాతీయ రహదారిని అనుకుని ఉన్న ఏపీ నిట్ ప్రహరీ గోడ పక్కనే చెత్తను డంప్ చేస్తున్నారు. ఒక్కోసారి అక్కడే చెత్తకు నిప్పు పెడుతుండడంతో రహదారిపై ప్రయాణించేవారికి మాత్రమే కాదు, నిట్ ప్రాంగణంలో కూడా ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

• ఆకివీడులో కార్మికుల కొరత



ఆకివీడు : పట్టణంలో ఏవైపు చూసినా చెత్త దర్శనమిస్తున్నది. ఇప్పటి వరకూ కనీసం డంపింగ్‌యార్డు లేదు. ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అదే డంపింగ్ యార్డు. పట్టణంలో అనధికార డంపింగ్ యార్డులే దర్శనమిస్తాయి. పట్టణ పరిధిలో రోజుకు 18 టన్నులు చెత్త వస్తుంది. తడి చెత్త 3 టన్నులు, 15 టన్నులు పొడి చెత్త వస్తుంది. పట్టణంలో సుమారు 40 వేల జనాభా ఉన్నారు. ఒక్కొక్క రూ.500 గ్రాములు చెత్తను ఉత్పత్తి చేస్తున్నారు. పట్టణ పరిధిలో 77 మంది పారిశుధ్య కార్మికులకు 63 మందే పనిచేస్తున్నారు. 14 మంది కార్మికుల కొరత ఉంది. దీంతో చెత్త ఎక్కడ పడితే అక్కడ కనబడుతోంది.

• సేకరించిన చెత్త రీసైక్లింగ్ ...

పాలకొల్లు అర్బన్ : పట్టణంలోని 31 వార్డుల్లో సుమారుగా 68 వేల మంది జనాభా ఉన్నారు. ప్రతీ రోజు ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణకు 19 వాహనాలతో పాటుగా 6 ట్రాక్టర్లు ద్వారా చెత్త సేకరణ జరుగుతోంది. ఇందుకు 140 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. రోజు వారీ సుమారుగా 42 మెట్రిక్ టన్నుల చెత్త వస్తోంది. దీనిలో తడిచెత్త 28 మెట్రిక్ టన్నులు కాగా, పొడి చెత్త 14 మెట్రిక్ టన్నులు సేకరిస్తున్నట్టు కమిషనర్ విజయ సారథి తెలిపారు. పట్టణంలో చెత్త సేకరణ 100 శాతం ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్నారు. సేకరించిన చెత్తను రీసైక్లింగ్ చేసి పట్టణంలోని పార్కుల్లో వేసి చదును చేస్తున్నట్టు కమిషనర్ తెలిపారు.


చెత్త సేకరించే వాహనాలు

ప్రధాన సమస్య కంపోస్టు యార్డు

భీమవరం టౌన్ : భీమవరం మునిసిపాల్టీకి డంపింగ్ యార్డు ప్రధాన సమస్యగా పట్టి పీడిస్తోంది. దీర్ఘకాలికంగా మునిసిపాల్టీకి ఈ సమస్య గుది బండగా మారింది. పట్టణంలో 39 వార్డుల నుంచి ఇంటింటి నుంచి చెత్త సేకరణ సాగుతోంది. దీనిద్వారా. రోజుకు దాదాపు 70 మెట్రిక్ టన్నుల చెత్త వస్తోంది. ఇందులో తడిచెత్త దాదాపు 28.5 మెట్రిక్ టన్నులు, మిక్సిడ్ చెత్త దాదాపు 31.5 మెట్రిక్ టన్నులు వస్తోంది. సేకరించిన చెత్తను వేసేందుకు స్థలంలేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ప్రస్తుతం 100 మంది పర్మినెంట్ కార్మికులు ఉండగా 250 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఉన్నారు. వార్డుకు దాదాపు 10 మంది కార్మికులు అవసరమని అంచనా వేస్తు న్నారు. ప్రస్తుతం భీమవరం జిల్లా కేంద్రంగా మారటంతో పాటు, పరిధి పెరుగుతున్న నేపథ్యంలో పారిశుధ్యానికి మరింతమంది సిబ్బంది అవసరం అని చెబుతున్నారు. చెత్తసేకరణకు వాహ నాలను పక్కన పెట్టేయడంతో మునిసిపాల్టీ సొంతంగా పుష్ కార్టులను తయారు చేయించి తడిపొడి చెత్త సేకరణ నిర్వహిస్తోంది. ఉదయం చెత్త సేకరణ చేసినా తరువాత కొంత మంది చెత్తను రోడ్ల పై వెయ్యడంతో అపరిశుభ్రంగా మారంటంతో అటు వంటి ప్రాంతాలను గుర్తించి చెత్త వేసేవారిపై నిఘా పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

ఉన్న సిబ్బందితోనే చెత్త సేకరణ



పట్టణంలో ఉన్న 39 వార్డుల్లో చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరుగుతోంది. ప్రతీరోజు ఒక వార్డులో పర్యటించి పారిశుధ్య పరిస్థితి పరిశీలిస్తు న్నాం. చెత్త బయట వెయ్యకుండా చర్యలు తీసు కుంటున్నాం. సిబ్బంది అవసరమైతే ఉన్నతాధికా రుల దృష్టికి తీసుకువెళ్ళి ఏర్పాటు చేసుకుంటాం. కార్మికులు వచ్చినపుడు ప్రజలు తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలి.

- కె.రామచంద్రారెడ్డి, మునిసిపల్ కమిషనర్

నరసాపురంలోనూ ఇదే సమస్య

నరసాపురం : నరసాపురం పురపాలక సంఘానికి డపింగ్‌యార్డు పెద్ద సమస్యగా మారింది. సేకరించిన చెత్తను గోదావరి ఒడ్డున పడేస్తున్నారు. అయితే ఇటీవల నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆగ్రహం వ్యక్తం చేయడంతో చెత్త ఎక్కడ వేయాలో తెలియక పురపాలక అధికారులు తలలు పట్టుకుం టున్నారు. పట్టణానికి శివారున నాలుగు ఎకరాలు డపింగ్‌యార్డు నిమిత్తం కొనుగోలు చేశారు. అయితే గ్రామస్థులు ఆందోళనకు దిగడంతో ఈ ప్రతిపాదన విరమించు కున్నారు. 15 రోజుల నుంచి చెత్త ఎక్కడ వేయాలన్న దానిపై మల్లగుల్లాలు పడుతున్నారు. పట్టణంలో 31వార్డుల్లో రోజుకు 32 టన్నుల చెత్తను సేకరిస్తున్నారు. జనాభా 60 వేలు ఉండగా 17,348 నివాసాలు ఉన్నాయి. ఒక్కొ మనిషి రోజుకు నగటున ఆరకేజీ చెత్త పడే స్తున్నట్లు అధికారులు అంచనా. ప్రస్తుతం పురపాలక సంఘంలో శానిటరీ విభాగంలో 33 మంది రెగ్యులర్ , మరో 91 మంది అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్నారు. ఇటీవల రోజుకు రూ.500 చెల్లించే విధంగా టీఎల్ఎఫ్ పద్ధతిలో 32 మంది కార్మికులను పెట్టుకున్నారు. అయినప్పటికి ఇంకా 60 మంది సిబ్బంది కావాల్సి ఉంది.

స్థలం దొరికితే సమస్య తీరినట్టే..



డంపింగ్ యార్డే మునిసిపాల్టీకి పెద్ద సమస్య. సేకరిస్తున్న చెత్తను ఎక్కడ వేయాలో తెలియడం లేదు. పురపాలక సంఘానికి నాలుగైదు స్థలాలు ఉన్నప్పటికీ అవి జనావాసాల మధ్య ఉన్నాయి. అక్కడ చెత్త వేసేందుకు ప్రజలు ఒప్పుకోవడం లేదు. దీంతో అనువైన స్థలం కోసం వెతుకుతున్నాం.. ఈ సమస్య తీరితే రోజువారీ వేతనాలతో మరో 50 మందిని నియమించుకుని ఎక్కడా చెత్త సమస్య తలెత్తకుండా చూసుకుంటాం. **- అంజయ్య, కమిషనర్**

సెలవు రోజుల్లో వార్డులన్నీ కంపు..

ఏలూరు టూటౌన్ : నగరపాలక సంస్థ 50 డివిజన్స్‌లో ప్రతీరోజు 103 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. తడి చెత్త 63 టన్నులు, పొడిచెత్త 40 టన్నులు ఉత్పత్తి అవుతుంది. ఈ చెత్తను పోణంగిలోని డంపింగ్ యార్డుకు వాహనాల్లో తరలిస్తున్నారు. నగరంలో 3 లక్షల మంది జనాభా ఉన్నారు. ప్రతీ ఇంటిలో సుమారు 3 కేజీ చెత్త తయారవుతుంది.


ఏలూరులో పార్కు పక్కనే చెత్త

పారిశుధ్య కార్మికులు 776 మంది ఉన్నారు. కార్మికులు సరిపడినంత ఉన్నప్పటికి వీరంతా ఎక్కువ మంది విధుల్లో ఉండరనే ఆరోపణలు ఉన్నాయి. అధికారుల సొంత పనులకు కొంత మంది, ప్రజాప్రతినిధులు ఇళ్ళల్లో కొంత మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారనే విమర్శ లున్నాయి. దీంతో క్షేత్రస్థాయిలో పారిశుధ్య పనులు చేసే వారి కొరత ఏర్పడింది. ఆదివారం, పండుగ దినాల్లో కార్మికులు ఇంటికే పరిమితం కావడం వల్ల మర్నాడు కార్మికులు వీధుల్లోకి వచ్చే వరకు చెత్త అంతా కుళ్ళిపోయి దుర్వాసన రావడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

రోజూ స్పెషల్ డ్రైవ్



నగరంలో పారిశుధ్యానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాం. ప్రతీ రోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. ప్రతీరోజు ఉదయన్నే తడి, పొడి చెత్తను వేరు చేసి డంపింగ్‌కు తరలిస్తున్నాం. తడిచెత్తతో వర్మీకంపోస్టు ఎరువు తయారు చేస్తున్నాం. పొడిచెత్తను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెపుతున్నాం. తడిచెత్తతో విద్యుత్ తయారు చేసే ప్లాంట్‌ను నెలకొల్పడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. పారిశుధ్య కార్మికుల కొరత లేదు.

- భానుప్రతాప్, నగరపాలక సంస్థ కమిషనర్


నరసాపురం రైతు బజార్ వద్ద పేరుకుపోయిన చెత్తకుప్పలు


జాతీయస్థాయి వర్క్‌షాపులో పాల్గొని సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో జాతీయస్థాయి వర్క్‌షాపు

దెందులూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : వ్యాయామ విద్యనభ్యసించే వారు తప్పని సరిగా క్రీడల నిర్వహణ, నియమ నిబంధనలు తప్ప నిసరిగా తెలుసుకోవాలని ఇండియా స్పోర్ట్ అథారిటీ ఆఫ్ చీఫ్ కోచ్ డాక్టర్ వినాయక ప్రసాద్, డాక్టర్ సర్ఫోజీ అన్నారు గోపన్నపాలెం సీతా రామ ప్రభుత్వ వ్యాయామ కళాశాలలో అథ్లెటిక్స్‌లో నియమ నిబంధనలపై బుధవారం జాతీయస్థాయి వర్క్‌షాపు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అథ్లెటిక్స్ రూల్స్ అండ్ రేగ్యులేషన్స్‌పై విద్యార్థులకు అవగహన కలిగించారు. అనంతరం సర్టిఫికెట్లను అందించారు, వ్యాయామ ఉపాధ్యాయులు దిలీప్, రత్నబాబు తదితరులు ఉన్నారు

జాతీయస్థాయి సైన్సు ఫెయిర్‌కు దెందులూరు టీచరు కళ్యాణి

ఏలూరు అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో రెండు రోజులపాటు జరిగిన రాష్ట్ర స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో జిల్లాతరఫున పాల్గొన్నవారిలో టీచర్స్ కేటగిరీ నుంచి దెందు లూరు జడ్పీ హైస్కూలు టీచర్ కళ్యాణి జాతీయస్థాయి సైన్సు ఫెయిర్‌కు ఎంపి కయ్యారు. బుధవారం ముగిసిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ వివరాలను జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు తెలిపారు. జన్యు నిర్మాణం, ప్రొటీన్స్ వైద్యరంగంలో పరిశోధనల వైపు విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించడం ద్వారా, వారిని బయోటెక్నాలజీ ప్రయోగాల దిశగా ఆకర్షితులుగా చేయడానికి తాను ప్రదర్శించిన 'ఎక్స్‌ట్రాక్షన్ ఆఫ్ డీఎన్ఏ' ప్రాజెక్టు ప్రోత్సాహకరంగా ఉంటుందని కళ్యాణి వివరించారు.


బహుమతి అందుకుంటున్న కళ్యాణి

విజయవాడలో బుధవారం సాయంత్రం నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ బహుమతుల ప్రదానోత్సవంలో సమగ్రశిక్ష ఎస్‌పీడీ శ్రీనివాసరావు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ కృష్ణారెడ్డి నుంచి కళ్యాణి బహుమతిని అందు కున్నారు. కళ్యాణిని డీఈవో వెంకట లక్ష్మమ్మ, సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ పంకజ్‌కుమార్ అభినందించారు.

12న చింతలపూడిలో జిల్లా స్థాయి పాటల పోటీలు

చింతలపూడి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పురస్కరించుకుని ఈనెల 12వ తేదీన ముళ్ళగిరి ఆనంద మనోహర్ మెమో రియల్ ట్రస్టు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో చింతలపూడిలో జిల్లా స్థాయి సినీ పాటల పోటీలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు ఎం. ఇమ్మానియేల్ తెలిపారు. పోటీలో ప్రతిభ చూపిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు అందిస్తామని, ఉత్సాహవంతులు పాల్గొనాలని తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రజా సంఘాల కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు.

నేడు చిన వెంకన్న గిరి ప్రదక్షిణ

రేపు ఉత్తరద్వారంలో స్వామివారి దర్శనం

ద్వారకాతిరుమల, జనవరి 8(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి గిరి ప్రదక్షిణకు సర్వం సిద్ధమైంది. ముక్కోటి ఏకాదశి పర్వదినం ముందురోజున గిరి ప్రదక్షిణ చేయడం ఇక్కడ సంప్రదాయంగా వస్తున్నది. ఇప్పటికే ఆ మార్గాన్ని సిబ్బంది శుభ్రం చేశారు. ముళ్లపొదలు వంటివి తొలగించి బుల్‌డోజర్లతో దారిని బాగు చేశారు. శ్రీవారి పాదుకా మండపం నుంచి గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుంది. సుమారు ఆరు కిలోమీటర్ల మేర గజ, అశ్వ, భజన మండళ్ల, కోలాటాలు, గోవింద దీక్షాదారుల స్వామి నామస్మరణలతో ఈ యాత్రను వైభవంగా జరిపేందుకు అన్ని చర్యలు తీసు కున్నారు. గిరిప్రదక్షిణ మార్గంలో ఎండుగడ్డిని ఒకపొరగా పరచి గిరిప్రదక్షిణ చేసే స్వాముల పాదాలకు రాళ్ల గుచ్చుకోకుండా చర్యలు తీసు కున్నారు. పాదయాత్రగా వెళ్లే భక్తులకు మార్గ మధ్యలో నాలుగు చోట్ల మంచినీరు, ప్రసాదం, టీ,కాఫీ, బిస్కెట్, పాలు వంటివి ఇచ్చేలా చర్యలు చేపట్టారు.వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు.ముక్కోటి రోజున వైకుంఠ వాకిళ్ల తెరు చుకుని ఉంటాయని శ్రీమహావిష్ణువు గరుడ వాహనారూఢుడై మూడుకోట్ల దేవతలతో భూలో కానికి వచ్చి భక్తజనులను సాక్షాత్కరిస్తారని పండితులు చెబుతున్నారు. మూడుకోట్ల ఏకా దశులతో సమమైన ముక్కోటినాడు ఉపవాసం, జాగరణ, జపం, ధ్యానం చేయడం ద్వారా పుణ్య ఫలితం లభిస్తుందని చెబుతున్నారు.



ఉత్తర ద్వార దర్శనానికి క్యూలైన్ల ఏర్పాటు


గిరి ప్రదక్షిణ మార్గంలో సేద తీరేందుకు వేసిన టెంట్లు


విద్యుద్దీప కాంతుల్లో శ్రీవారి ఆలయం

ముక్కోటికి ముస్తాబు

అలాగే ఆలయంలో శుక్రవారం జరిగే ముక్కోటి పర్వదిన వేడుకలకు సర్వం సిద్ధమవు తోంది ముఖ్యంగా ఆరోజు శ్రీవారిని ఉత్తరద్వారం గుండా వీక్షించే క్రమంలో ఇప్పటికే ఉత్తర ద్వారాలను సిద్ధం చేశారు. ఆలయ గోపురాలు విద్యుత్‌దీపతోరణాలతో, రంగులతో ముస్తాబయ్యాయి. ఆరోజు శ్రీవారు వెండిగరుడ, శేషవాహనాలపై ఉత్తరద్వారం వద్ద కొలువై భక్తులకు దర్శన మీయనున్నారు. ఆరోజు ఉదయం 4-30 గంటల నుంచి ప్రొటోకాల్, సర్వదర్శనం, రూ.100, 200, 500 టికెట్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఈవో వేంద్ర త్రినాథరావు తెలిపారు. గోవింద స్వాములకు, స్థానికులకు ప్రత్యేక లైన్ ఏర్పాటు చేస్తామ న్నారు. చిన్న పిల్లలకు పాలు , బిస్కెట్స్ అలాగే పెద్దసంఖ్యలో రానున్న భక్తులకు ఉదయం 10 గంటల నుంచే అన్నప్రసాదానికి అనుమతి ఉంటుందన్నారు.



వైభవంగా శ్రీవారి తిరువీథిసేవ..

ధనుర్మాసం పురస్కరించుకుని స్వామివారు, ఉభయదేవేరులు, గోదాదేవితో కలసి క్షేత్రపురవీథుల్లో బుధవారం ఉదయం ఊరేగారు. తొళక్క వాహనంపై శ్రీవారు, అమ్మవార్లు తో పాటు గోదాదేవి ఉత్సవమూర్తులను ఉంచి అర్చకులు ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. మేళతాళాలతో పురవీథుల్లో ఊరేగించారు.

కాళ్లకూరులో ఏర్పాట్లు

కాళ్ళ; జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని కాళ్ళకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. శుక్రవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున 3 గంటల నుంచి భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకునేందుకు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేసినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి మోకా అరుణ్ కుమార్ చెప్పారు. స్వామివారి దర్శనానికి చుట్టుపక్కల గ్రామాలతో పాటు ఇతర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేస్తారని తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.




విద్యుత్ దీపాల కాంతుల్లో ఆలయం



మోదీకి బ్రహ్మరథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం





విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దత్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనంపైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్

బహిరంగ సభకు హాజరైన అశేష జనం





రెండో ప్రపంచ తెలుగు మహాసభల్లో ప్రసంగిస్తున్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, వేదికపై ప్రముఖులు


తెలుగు వెలుగులు

రాజమహేంద్రవరంలో ప్రపంచ తెలుగు మహాసభలు

రాజానగరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రాంగణంలో రెండో ప్రపంచ తెలుగు మహాసభలు బుధవారం ప్రారంభమయ్యాయి. వేడుకల్లో ప్రధాన వేదికను ఆనుకుని తీర్చిదిద్దిన అయోధ్య రామ మందిరం నమూనా విశేషంగా ఆకట్టుకుంది. సాంకేతికతను వినియోగించి అయోధ్య బాలరాముని ఆలయం తీర్చిదిద్దినట్టు జీజీయూ ఉప కులపతి ఉదయగిరి చంద్రశేఖర్ తెలిపారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, అబ్దుల్ కలాం అవతార్ (డిజిటల్) స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ఎవరైనా ప్రశ్నలు అడిగితే సరైన సమాధానాలు వారి నుంచి వస్తాయని చెప్పారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రపంచ తెలుగు మహాసభలను పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పాఠశాల విద్యార్థులు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే రీతిలో చేసిన పలు ప్రదర్శనలు విశేషంగా అలరించాయి. ప్రధానంగా భువన విజయం, నెమలి నృత్య ప్రదర్శన, జానపద నృత్య ప్రదర్శన, కవి సమ్మేళనాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి.







తెలుగు మహాసభల వేదిక వద్ద అయోధ్య బాల రామ మందిరం నమూనా





అలరించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన

మహాసభల వద్ద స్టాల్స్ సందర్శించిన విద్యార్థులు



సభా ప్రాంగణం వద్ద నన్నయ, కందుకూరి వీరేశలింగం, శ్రీకృష్ణదేవరాయల విగ్రహాలు

కానిస్టేబుల్ ఎంపిక పోటీలో 313 మంది అర్హత

ఏలూరు క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా బుధవారం 1600 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్, పలు ఈవెంట్స్‌ను 313 మంది అర్హత సాధించారు. 600 మంది హాజరు కావలసి ఉండగా 459 మంది హాజరయ్యారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ పర్యవేక్షణలో ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు పలువురు పోలీసు అధికారులు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఇచ్చిన తేదీలో హాజరుకాలేక అప్పీలు చేసుకున్న అభ్యర్థులు ఈనెల 9న నిర్వహించే దేహదారుఢ్య పరీక్షలకు హాజరు కావాలని ఎస్పీ సూచించారు. మానూరి చంద్ర (22) పరుగుపందెంలో పడిపోవడంతో కాలికి దెబ్బతగిలింది.

పోలీస్ శాఖలో 32 మందికి బదిలీ మెమో

ఏలూరు క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పోలీసుల శాఖలో పరిపాలనా సౌలభ్యం నిమిత్తం 32 మందిని మెమోతో బదిలీ చేస్తు ఎస్పీ కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. తక్షణం బదిలీ అయి కొత్త పోస్టింగ్‌లలో చేరాలని పేర్కొన్నారు. ఒక ఏఎస్ఐ, 10 మంది హెడ్ కానిస్టేబుళ్లు, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు, 19 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేశారు.

మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబుపై కేసు నమోదు

గోపాలపురం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబుపై గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. మండలంలోని మాతంగమ్మ ఆగ్రో రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచి పీడీఎస్ బియ్యం నిల్వలను రెండురోజుల క్రితం సివిల్ సప్లై అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రైస్ మిల్లులో సమారు 5 టన్నుల బియ్యం విలువ రూ.14.31 లక్షలు. సివిల్ సప్లై డీటీ తాతపూడి దివాకర్ ఫిర్యాదు మేరకు రైస్‌మిల్లు డైరెక్టర్, మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబుతో పాటు మేకా శశికళ, మేకా నేతాజీ శ్రీనివాస్, తల్లాడి వరలక్ష్మి, వెలగా శ్రీరామమూర్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ కె.సతీష్‌కుమార్ తెలిపారు. లారీ డ్రైవర్ పెనుబోను శ్రీనివాస్, లారీ ఓనర్ పెనుబోను నాగదుర్గపై కూడా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. లారీ స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

తప్పుడు వార్తల జగన్ మీడియాపై అంధుల నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంధులు

ఏలూరు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తప్పుడు వార్తల జగన్ మీడియాపై అంధులు నిరసన వ్యక్తం చేశారు. ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం లూయిస్ బ్రెయిలీ జయంతి కార్యక్రమానికి కలెక్టర్ ఆలస్యంగా రావడంతో అంధులు ఇబ్బంది పడ్డారని అసత్య కథనాన్ని ప్రచురించడంపై మండిపడ్డారు. కలెక్టరేట్ వద్ద బుధవారం నిరసన తెలిపారు. విజువల్లీ ఛాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు జీడీవీఎస్ వీరభద్రరావు, ప్రధాన కార్యదర్శి కె.మదన్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో తాము నిద్రించినట్లు చూపుతూ అంధులమైన తమ హావభావాలను అవహేళన చేసేవిధంగా ప్రచురించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంధులు, దివ్యాంగులపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ చూస్తున్నారని, తమను అవమానపరిచేవిధంగా ప్రచురించిన పత్రికపై ప్రెస్‌కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేస్తామన్నారు. కె.కర్ణుడు, పి.వెంకటేశ్వరరావు, కె.ఏసురాజు, మహిళా కార్యదర్శి సిహెచ్ వేళంగిణి తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం వీడండి

అభివృద్ధి పనుల్లో అధికారుల తీరుపై ఎమ్మెల్యేల నిరసన

వాడి వేడిగా జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

ఏలూరు సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు పూర్తి చేయడం, సంక్షేమ పథకాల అమలులో అధికారులు అలసత్వం వీడాలని పలువురు ఎమ్మెల్యేలు అన్నారు. ఏలూరులోని జడ్పీ కార్యాలయంలో బుధవారం జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరిగిన స్థాయీ సంఘ సమావేశాల్లో ఎమ్మెల్యేలు, జడ్పీటీసీ సభ్యులు పలు సమస్యలు ప్రస్తావించారు. ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పనుల్లో అధికారులు అలసత్వ ధోరణి తగదని, కాంట్రాక్టర్లతో పనులు వేగవంతంగా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పూర్తయిన అభివృద్ధి పనులు ప్రారంభించడంతో పాటు, రానున్న రోజుల్లో చేపడుతున్న రహదారుల అభివృద్ధి పనులకు ఈనెలలోనే శంకుస్థాపనలు చేసేలా అధికారులు చొరవ చూపాలని సూచించారు. విద్యుత్ శాఖపై చర్చ జరుగుతుండగా నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ సూర్యఘర్ యోజనపై ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులను కోరారు. పథకాల అమలును అధికారులు ఎమ్మెల్యేలకు తెలియజేయాలన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరువయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ పాఠశాల విద్య ప్రమాణాలు పెంచేదిశగా విద్యాశాఖాధికారులు కృషి చేయాలన్నారు.

రోడ్ల పనులు పూర్తి చేయాలి : ఎంపీ

జిల్లాలో రూ. 97 కోట్లతో చేపట్టిన ఆర్‌అండ్‌బి రహదారుల అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ సూచించారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారుల అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కైకలూరు, పోలవరం, ఉంగుటూరు, దెందులూరు, చింతలపూడి నియోజకవర్గాల పరిధిలో 13 రహదారుల మరమ్మతు పనులు చేపట్టినట్లు చెప్పారు. పనులు పూర్తి నాణ్యతతో నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. స్థాయి సంఘ సమావేశాల్లో జడ్పీ సీఈవో కెఎస్ఎస్ సుబ్బారావు, డిప్యూటి సీఈవో కె భీమేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ మహేశ్, జడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ, అధికారులు

అభివృద్ధి చేయండి : పద్మశ్రీ

జిల్లాలో అభివృద్ధి పనులు, రహదారుల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధికారులకు సూచించారు. రహదారి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. 3, 5, 6 కమిటీల సమావేశాలు జడ్పీ సీఈవో ఛాంబర్‌లో జరిగాయి. ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, ఎమ్మెల్యేలు బడేటి చంటి), బొలిశెట్టి శ్రీనివాసరావు, పత్సమట్ల ధర్మరాజు, బొమ్మిడి నాయకర్, మద్దిపాటి వెంకట్రాజు, ఎమ్మెల్సీ గోపిమూర్తి, జడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. ఆర్‌అండ్‌బి రహదారుల పనుల పురోగతి, మంచినీటి పథకాల పనులు, కాల్వలకు నీటి విడుదల, తాత్కాలిక మరమ్మతులు, ఎంపీ ల్యాడ్స్ వినియోగం, సోలార్ విద్యుత్, జిల్లాలో సోలార్ మోడల్ గ్రామాలు, రైతులకు ఉచిత విద్యుత్, విద్యా ప్రమాణాలు, మధ్యాహ్న భోజన పథకం ప్రగతిపై చర్చించి అధికారులకు తగు సూచనలు చేశారు.



ఎంపీ, ఎమ్మెల్యే, జడ్పీటీసీ సభ్యులు



జడ్పీ స్థాయీ సంఘ సమావేశంలో ఎమ్మెల్యేలు బొమ్మిడి నాయకర్, పత్సమట్ల ధర్మరాజు, బొలిశెట్టి శ్రీనివాస్

'పది' ప్రత్యేక తరగతులను పరిశీలించండి

- పాఠశాల విద్య డైరెక్టర్ సూచన

ఏలూరు అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను డీఈవో, క్షేత్రస్థాయి అధికారులు తనిఖీ చేయాలని పాఠశాల విద్య డైరెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. బుధవారం నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో ఉపాధ్యాయుల ఇన్ఫర్మేషన్ సిస్టం (టిస్), కొత్తగా ఏర్పాటు చేయతలపెట్టిన స్కూల్ కాంప్లెక్స్ క్లస్టర్లు, జీవో 117 రద్దు, తదితర అంశాలపై పలు సూచనలు ఇచ్చారు. మార్చిలో ప్రారంభంకానున్న ఎస్ఎస్‌సీ పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధతపై ప్రధానంగా దృష్టి సారించాలని, ముఖ్యంగా ప్రత్యేక తరగతులను ప్రత్యక్షంగా పరిశీలించాలని ఆయన విజయరామరాజు సూచించారు. ఏప్రిల్‌లోనే టీచర్ల సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నామని, ఇందులో భాగంగా ముందుగా అన్ని కేడర్లు, సబ్జెక్టుల్లో పదోన్నతులకు సీనియార్టీ జాబితాలను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. డీఈవో వెంకటలక్ష్మమ్మ, అసిస్టెంట్ డైరెక్టర్ షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

బతికుండగానే చంపేశారు!

పోలవరం పరిహారాన్ని నిలిపివేసిన అధికారులు



కుక్కునూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బతికుండగానే చనిపోయననిచెప్పి బ్యాంకు ఖాతాలో జమ అయిన పోలవరం పరిహారాన్ని అధికారులు నిలిపివేశారు. కుక్కునూరు ఎ బ్లాక్ నిర్వాసితుడు షేక్ పకీర్ సాహెబ్‌కు ఆర్‌అండ్‌ఆర్ పరిహారం రూ.6.36 లక్షలు బ్యాంకు ఖాతాలో జమ అయింది. అతడు బ్యాంకుకు వెళ్ళగా ఖాతా నిలుపుదల చేసినట్లు తెలిపారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో మృతి చెందిన 24 మంది బ్యాంకు ఖాతాలను అధికారులు ఫ్రీజ్ చేశారు. షేక్ పకీర్‌సాహెబ్ పేరుతో కుక్కునూరులో మరో ఇద్దరున్నారు. వారు మృతి చెందారు. అయితే అధికారులు పొరపాటున ప్రస్తుతం బతికి ఉన్న పకీర్‌సాహెబ్‌ను మృతి చెందిన వాడిగా గుర్తించి రికార్డును ఫ్రీజ్ చేశారు. దీంతో తాను బతికే ఉన్నానని, తనకు న్యాయం చేయాలని నా పరిహారం నాకు ఇప్పించండి అంటూ అతడు అధికారులను కోరుతున్నాడు.

లారీ ఢీకొని ఒకరి మృతి



నాగు మృతదేహం

ఏలూరు క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై నిలబడి ఉన్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. భీమడోలుకు చెందిన బొందుల నాగు (50) బుధవారం రాత్రి ఏలూరు సమీపంలోని ఆశ్రం వద్ద బైపాస్ రోడ్డుపై నిలబడి ఉండగా లారీ ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నాగు భిక్షాటన చేస్తూ జీవిస్తుంటాడు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ దుర్గా ప్రసాద్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



విద్యుదాఘాతంతో మృతి చెందిన అభయ్

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తాపీ పనిచేస్తున్న బాలుడు విద్యుదాఘాతంతో మృతి చెందిన ఘటన తాడేపల్లిగూడెం పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాడేపల్లిగూడెంలోని కడకట్ల ప్రాంతానికి చెందిన కాళిదాసు ధన అభయ్ (16) తాడేపల్లిగూడెం శివారు మదర్‌వన్నిని ఆసుపత్రి ఎదురుగా ఉన్న భవన నిర్మాణాల్లో తాపీ పనికి వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా విద్యుత్ వైరు తెగి పక్కనే నీటిలో పడి ఉంది. అటువైపు నడిచి వెళుతున్న అభయ్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే పడిపోయాడు. వెంటనే బాలుడిని తాడేపల్లిగూడెంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అభయ్ తండ్రి శంకర్ పెయింటింగ్ పని చేస్తుంటాడు. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె చిన్న వయస్సులోనే అనారోగ్యంతో మృతి చెందింది. ఇప్పుడు కుమారుడు కూడా విద్యుదాఘాతంతో మృతిచెందగా ఆ కుటుంబం కన్నీటి సంద్రమైంది. పనులకు వెళుతూ కుటుంబానికి ఆసరాగా ఉన్న అభయ్ మృతితో వారిని ఓదార్చడం ఎవరితరం కాలేదు. ఇద్దరి పిల్లలను కోల్పోయిన వారి రోదన చూపరులను కంటతడిపెట్టించింది.

దాళ్వా ప్రణాళిక

(5వ పేజీ తరువాయి)

క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఫిబ్రవరి మొదటి వారంలో సాగు నీటికి ఇబ్బందులు లేకుండా వంతుల వారీ విధానాన్ని తీసుకువస్తారు. గత నెల వరకు వర్షాలు అధికంగా కురవడం వల్ల ఈ దాళ్వాలో పుష్కలంగా సాగు నీరు ఉంటుందనే అంచనాల్లో రైతులు ఉన్నారు. ఏటా మాదిరిగా దాళ్వాలోను వ్యవసాయ, కౌలు రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు సిద్ధంగా ఉన్నారు. రూ.4,005 కోట్లు వ్యవసాయ రుణాలు ఇవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేశారు. గత నెలాఖరు నాటికి మూడు వేల మంది కౌలు రైతులకు రూ.20 కోట్లకుపైగా రుణాలిచ్చారు. 37 వేల కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు.

నేడు సూర్యఘర్‌పై అవగాహన సమావేశం

భీమవరం టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్యాలయంలో సూర్య ఘర్ సోలార్ ప్రాజెక్ట్ (ఇంటిపై సోలార్ ఏర్పాటు) కు సంబంధించి గురువారం సమావేశం నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ రఘునాథ బాబు తెలిపారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ నాగరాణి అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. కాలనీలో సోలార్ పెట్టించుకున్న వారు, కొత్తగా పెడదామను కున్నవారు హాజరు కవాలని కోరారు. సోలర్ విద్యుత్‌కు సంబందించిన పూర్తి సమాచారంతోపాటు అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు.

విద్యుత్ సమస్యలు తెలపండి

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్తు వినియోగదారులకు మేలైన సేవలందిం చేందుకు స్వయంగా విద్యుత్ నియంత్రణ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ ఉపయోగించుని సమస్యలు తెలపాలని తాడేపల్లిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె నరసింహమూర్తి కోరారు. తాడేపల్లిగూడెం డివిజనల్ కార్యాలయం వద్ద ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ రెండో రోజు కొనసాగింది. చివరిగా ఈ నెల 10న బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ ఉంటుందని, ఈ అవకాశం విద్యుత్తు వినియోగదారులు వినియోగించుకోవాలని సూచించారు.

జంతు సంక్షేమ కార్యదర్శుల నియామకం

భీమవరం టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా జంతు సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గోరక్ష అధ్యక్షుడు సుంకర దాసు నియమితులయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంతు సంరక్షణకు తమ వంతు కృషి చేస్తామని, తమకు ఈ పదవి రావడానికి సిఫార్సు చేసిన ఎమ్మెల్యే అంజిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

15 వరకు బీమా గడువు

పెంటపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకాన్ని ఈ నెల 15వ తేదీ వరకూ ప్రభుత్వం పొడిగించిందని ఏవో పార్థసారథి తెలిపారు. ఇప్పటివరకూ మండలంలో సుమారు 268 రైతులు బీమాలో నమోదయ్యారని, నమోదు చేసుకున్నవారికి పంటల బీమా సదుపాయాలు అందుతాయన్నారు. ఇంకా నమోదు కాని వారు ఎవరైనా ఉంటే కార్యాలయంలో సంప్రదించాలన్నారు. అలాగే వర్తకులు ఎరువులను ఎంఆర్‌పీ ధరలకే విక్రయించకుంటే చర్యలు తప్పవన్నారు.

11న ముగ్గుల పోటీలు

నరసాపురం టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వలంధర్ రేవులో ఈ నెల 11న నాయకర్ ట్రస్టు ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బొమ్మిడి సునీత తెలిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనవచ్చన్నారు. విజేతలకు బహుమతులతో పాటు కన్సొలేషన్ బహుమతులు కూడా ఉంటాయన్నారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు శిక్షణ

నరసాపురం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాల యంలో బుధవారం నరసాపురం, మొగల్తూరు మండలాలకు చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉపాధి పనులపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో రామకృష్ణంరాజు మాట్లాడుతూ రానున్న వేసవిలో గ్రామాల్లో ఎక్కువ పనులు చేపట్టేందుకు కార్యచరణ రూపొందించాలన్నారు. ఏయే పనులు, లక్ష్యాలు పూర్తి, కొలతలు ఏవిధంగా నమోదు చేయాలి, కొత్త వారికి పనులు కల్పించడం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఏపీవోలు వై శ్రీనివాస్, ఏటీ వెంకటేశ్వరావు, ఆనందబాబు పాల్గొన్నారు.

పెన్షన్ల తనిఖీ

అత్తిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ తనిఖీల్లో భాగంగా 3వ రోజు మంచిలి, ఆరవల్లి, స్కిన్నెరపురం, కొమ్మర, ఊడూరు పాలూరు గ్రామాల్లో మంచానికే పరిమితమైన 22 మంది పెన్షనర్లను తనిఖీ చేశారు. డాక్టర్ జాన్, డాక్టర్ సుస్మా, డాక్టర్ రవికుమార్, పి సంతోష్‌కుమార్, ఎంపీడీవో పి శామ్యూల్, విస్తరణ అధికారి ఎం. శ్రీనివాసరావు మంచిలి డాక్టర్ కిరణ్మయి, ఏపీఎం మొహమ్మద్ పాల్గొన్నారు.

బీజేపీ కాళ్ళ మండలాధ్యక్షుడిగా పానకాల

కాళ్ళ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బీజేపీ కాళ్ళ మండలాధ్యక్షుడిగా పానకాల కృష్ణాంజనేయరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పెద అమిరంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోరా రామ్మూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్వహించిన ఎన్నికల్లో కార్యకర్తలు కోమటిగుంట గ్రామానికి చెందిన కృష్ణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



నాట్లు వేసిన హైస్కూల్ విద్యార్థులు

తణుకు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ముద్దాపురంలోని జడ్పీ హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు వరి నాట్లు వేశారు. 'పంట ఉత్పత్తులు' అనే పాఠ్యాంశానికి సంబంధించి విద్యార్థుల క్షేత్ర పర్యటన, పరిశీలనలో భాగంగా విద్యార్థులంతా గ్రామంలో వరినాట్లు వేశారు. నాట్లు, ఎరువులు, పురుగు మందులు, నీటి పారుదల, పెట్టుబడులు, దిగుబడులు పంట సాగులో కష్టనష్టాలపై రైతులనడిగి తెలుసుకున్నారు. హెచ్ఎం సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సోలార్ పవర్ ప్లాంటు సందర్శించిన డిగ్రీ విద్యార్థులు

గణపవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గణపవరం చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ బీఎస్సీ విద్యార్థులు బుధవారం ఏలూరు జిల్లా గొల్లగూడెంలోని సోలార్ పవర్ ప్లాంటును సందర్శించారు. సోలార్ ప్రాజెక్టు సైట్ ఇంజనీర్ కె. నాగపెద్ది గంగాచారి తదితరులు విద్యార్థులకు సౌరశక్తి, ఉత్పత్తి విధానంపై వివరించారు. ప్రిన్సిపాల్ నిర్మలకుమారి, భౌతిక శాస్త్ర విభాగాధిపతి మధురాజు, భౌతిక శాస్త్ర అధ్యాపకులు గణేష్‌కుమార్, గిరిబాబు పాల్గొన్నారు.



డైరీ ప్రారంభించిన కలెక్టర్ నాగరాణి

జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం డైరీ ఆవిష్కరణ

భీమవరం టౌన్/ఆచంట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం డైరీలను, క్యాలెండర్‌లను కలెక్టర్ చదలవాడ నాగరాణి బుధవారం ఆవిష్కరించారు. డీపీవో అరుణ శ్రీ, పంచాయతీ కార్యదర్శుల సంఘం గౌరవ అధ్యక్షుడు దొంగ సత్యనారా యణ, అధ్యక్షులు పాల శారద శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి దేవాబత్తుల నాగదేవి, కోశాధికారి సుంకర వెంకటేష్, జి. నాగబాబు, పి. వీర్రాజు, ఎం. ప్రవీణ్, జి. సుబ్బారావు, కె. సునీత, పి. కనకరావు, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పెంటపాడు: ఏపీ ఎన్జీవోల వార్షిక క్యాలెండర్ ను బుధవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో బాలాజీ వెంకటరమణ ఆవిష్కరించారు. సూపరిం టెండెంట్ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ శర్మ, ఎన్జీవో తాడేపల్లిగూడెం తాలూకా అధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, మహిళా విభాగం జిల్లా కన్వీనర్ .నాగదేవి పాల్గొన్నారు.

తణుకు: ఏపీ నాన్ గెజిటెడ్, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్, తణుకు తాలుకా యూనిట్ క్యాలెండర్‌ను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆవిష్కరించారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కెఎస్‌వి నరసరాజు, కేశిరెడ్డి సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారుమూరి హయాంలోనే లేహంకు అనుమతులు : ఆరిమిల్లి



తణుకు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): లేహం ఫుడ్ పరిశ్రమకు అనుమతులన్నీ కారుమూరి హయాంలోనే వచ్చాయని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ స్పష్టం చేశారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో కూటమి నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడుతూ అనుమతులకు సంబంధించి పూర్తి పత్రాలతో మాట్లాడుతున్నానని, పరిశ్రమ ఆపడానికి ఆయన చేసిన ప్రయత్నాల్లో ఒక్క ఆధారం చూపినా తాను క్షమాపణలు చెబుతానన్నారు. ఇప్పటికే స్థానికుల ఇబ్బందులు నేపథ్యంలో కలెక్టరు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. కూటమి నాయకులు కలగర వెంకటకృష్ణ, కొమ్మిరెడ్డి శ్రీనివాసు, బొల్లాడ నాగరాజు, ఒమ్మి రాంబాబు, తాతపూడి మారుతీరావు, ఐ.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేయాలి : నాయకర్



నరసాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నరసాపురంలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు చేసి జిల్లా యువతకు ఉపాధి బాట వేయాలని మంత్రి లోకేశ్‌కు బుధవారం విప్ నాయకర్ విన్నవించారు. మంగళగిరిలో మంత్రిని కలసి పలు సమస్యలపై చర్చించారు. గతంలో మంత్రిగా ఉన్న సమయంలో హార్బర్, నల్లిక్రిక్ పనులకు శంకుస్థాపన చేశారని, ఇంత వరకు పురోగతి లేదని, గత ప్రభుత్వం రూ. 450 కోట్లతో హార్బర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి దగా చేసిందని, పేరుపాలెం బీచ్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, గతంలో ఈ ప్రాంతంలో మెరైన్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినా అమలకు నోచుకోలేదన్నారు. వశిష్ఠ వారధి, వీయర్ ఛానల్, మంచినీటి ప్రాజెక్టులు, రహదార్ల అభివృద్ధికి ప్రాధాన్యత కల్పించాలని కోరారు.

సైన్స్ ఫెయిర్‌లతో బయటపడే సృజనాత్మకత : అంజిబాబు



భీమవరం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సైన్స్ ఫెయిర్‌లతో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత వెలికితీయవచ్చునని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. భీమవరంలోని విశ్వకవి సీబీఎస్ఈ స్టేట్ సిలబస్ స్కూల్‌లో మ్యాథ్స్ అండ్ సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఆయన ప్రారంభించి విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించారు. స్కూల్ డైరెక్టర్ పొట్లూరి రఘుబాబు, ఏఎంసి మాజీ చైర్మన్ కోళ్ళ నాగేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మన్నే సుబ్రహ్మణ్యంకు నివాళులు

భీమవరం టౌన్: భీమవరం గాంధీ నగర్‌లో మన్నే సుబ్రహ్మణ్యం సంతాప సభ బుధవారం నిర్వహించారు ఎమ్మెల్యే అంజిబాబు పాల్గొని ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. టీడీపీ రాష్ట్ర నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, మన్నే శ్రీనివాస్, నల్లం చిట్టిబాబు, కొప్పినీడి శ్రీనివాస్, రెడ్డి సత్తిబాబు పాల్గొన్నారు.

యువత క్రీడా స్ఫూర్తిని అలవరచుకోవాలి : ఆర్డీవో దాసిరాజు



యలమంచిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నేటి యువత క్రీడాస్ఫూర్తిని అలవరుచుకోవాలని నరసాపురం ఆర్డీవో దాసి రాజు పేర్కొన్నారు. యలమంచిలిలో శ్రీమూల స్థానేశ్వరి సంక్రాంతి సంబరాల్లో భాగంగా తాళ్లూరి సత్యనారాయణ స్మారక మెమోరియల్ వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. క్రీడాకారులు, స్థానిక నాయకులతో కలిసి వాలీబాల్ ఆడారు. అనంతరం తాళ్లూరి సత్యనారాయణ కుమారుడు బాలచందర్, నిర్వాహకులు తాళ్లూరి శ్రీనివాస్ ఆర్డీవో దాసి రాజును సత్కరించారు. పోటీలు నాలుగురోజులపాటూ నిర్వహిస్తామని, విజేతలకు మొదటి బహుమతిగా రూ.36,000, రెండో బహుమతిగా రూ.18000 అందజేస్తామని నిర్వాహకుడు తాళ్లూరి శ్రీనివాస్ తెలిపారు.

మావుళ్ళమ్మ హుండీ లెక్కింపు

భీమవరం టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ అమ్మవారి హుండీలను బుధవారంనాడు తెరచి లెక్కించగా 36 రోజులకు ం21 లక్షల 68 వేల 846 రూపాయలు ఆదాయంగా వచ్చిందని దేవస్థానం సహాయ కమిషనర్ బుద్ధా మహాలక్ష్మి నగేష్ తెలిపారు. అన్నదానం హుండీ ద్వారా 37 వేల 821 రూపాయలు, బంగారం 42 గ్రాముల 800 మిల్లీ గ్రాములు, వెండి 75 గ్రాముల 500 మిల్లీ గ్రాములు, విదేశీ కరెన్సీ వచ్చాయని తెలిపారు. ఈ లెక్కింపును దేవాదాయ .ధర్మదాయ శాఖ ఇనస్పెక్టర్ వి వెంకటేశ్వరావు పర్యవేక్షించారని తెలిపారు.

బండి ముత్యాలమ్మ..

మొగల్తూరు: ముత్యాలపల్లి బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 48 రోజులకు గానూ రూ. 8 లక్షల 81 వేల 748లు ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో ఎం. అరుణ్ కుమార్ తెలిపారు. దేవదాయశాఖ ఈవోలు రమచంద్ర కుమార్, బి.శ్రీనివాసరెడ్డి, ఆలయ కమిటి చైరన్ కడలి మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద గ్లోబల్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

తణుకు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వివేకానంద గ్లోబల్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులకు ముగ్గులు, గాలిపటాలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎస్‌కెఎస్‌డి జూనియర్ కళాశా లలో కోకోకోలా కంపెనీ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. 56 మంది పాల్గొన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు బహుమతులందజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం

ఆకివీడు రూరల్ జనవరి 8 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసికోల్లాసాన్నిస్తాయని ఎస్ఐ నాగరాజు అన్నారు. ఆకివీడు మండలం దుంపగడపలోని వివిగిరి కళాశాలల ఆటస్థలంలో డీవైఎఫ్ఐ సంక్రాంతి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. భీమవరం, ఉండి, కైకలూరు నియోజకవర్గస్థాయి క్రికెట్‌పోటీలు నిర్వహిస్తున్నారు. 19జట్లు ఈపోటీలలో పాల్గొంటున్నాయి. ఎస్ఐ నాగరాజు బ్యాటింగ్ చేసి పోటీలలో యువతను ఆకట్టుకున్నారు.

నిరంతర అధ్యయనంతోనే సివిల్స్ విజయం



మాట్లాడుతున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నిరంతర అధ్యయనం, సామాజిక, ఆర్థిక పరిస్థితులపై పూర్తి అవగాహనతో సివిల్స్‌లో విజయం సాధించగలరని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి విద్యార్థులకు సూచించారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 'సివిల్ సర్వీసెస్ ప్రిపరేషన్ స్ట్రాటజీ అండ్ ప్రిపరేషన్ గైడ్' అంశంపై ఆయన మాట్లాడారు. ప్రతిరోజు దిన పత్రికల్లో వస్తున్న అంశాలు కూడా అధ్యయనం చేయాలన్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.భువనేశ్వరి అధ్యక్షత వహించగా కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ, ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణంరాజు మాట్లాడారు.

టెన్త్ శత శాతం ఉత్తీర్ణత సాధించాలి

పెనుమంట్ర: టెన్త్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా హెచ్ఎంలు కృషి చేయాలని జేసీ అన్నారు. బుధవారం నరసాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని జడ్పీ హైస్కూళ్ల హెచ్ఎంలతో మార్టేరులో టెన్త్ ఫలితాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సబ్జెక్టు ఉపాధ్యాయులు కొరత ఉంటే పక్క పాఠశాల నుంచి తీసుకువచ్చి సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. గత టెన్త్ ఫలితాల్లో వెనుకబడిన హైస్కూళ్ల హెచ్ఎంలు ప్రత్యేక యాక్షన్ ప్లాన్‌తో ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. డీఈవో ఇ.నారాయణ, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ పి.శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు. పెనుమంట్ర తహసీల్దార్ కార్యాల యాన్ని జేసీ ఆకస్మిక తనిఖీ చేసి రెవెన్యూ సదస్సుల్లో అందిన భూ సమస్యల అర్జీలను పరిశీలించారు. ప్రతి అర్జీని పరిష్కరించాలని, పరిష్కారం కాకుంటే అర్జీదారులకు కారణం తెలపాలన్నారు.

10, 11 తేదీల్లో వైఎన్ కళాశాల ప్లాటినం జూబిలీ వేడుకలు



నరసాపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైఎన్ కళాశాల ప్లాటినం వేడుకల్ని 10, 11 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు చెప్పారు. బుధవారం కళాశాలలో బ్రోచర్‌ను విడుదల చేసి విలేకర్లతో మాట్లాడుతూ వేడుకలకు కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నిమ్మల రామానాయుడు, కందుల దుర్గేశ్, డిప్యూటి స్పీకర్ రఘురామకృష్ణంరాజు, ప్రభుత్వ విప్ నాయకర్, ఎంపీలు పురందేశ్వరి, గంటి హరిష్ మాధుర్, అప్పలనాయుడు, బాలశౌరి విచ్చేస్తున్నట్లు చెప్పారు. వీరితో పాటు రిటైర్డు హైకోర్టు న్యాయమూర్తులు సోమయాజులు, గ్రంధి భవాని ప్రసాద్, ఐఏఎస్ అధికారులు కృష్ణబాబు, కన్నబాబుతో పాటు కళాశాలలో చదివి దేశ విదేశాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కూడా హాజరవుతారని, ఇప్పటి వరకు 500 మంది తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు చెప్పారు. 1949లో ఏర్పడిన కళాశాల అటానమస్‌గా ఆభివృద్ధి చెందిందన్నారు. రానున్న రోజుల్లో ఈ కాలేజీని డీమ్ యూనివర్సిటీగా మార్చాలన్నదే తమ లక్ష్యమన్నారు.



ఘనంగా కూటమి సంక్రాంతి సంబరాలు

ఆకివీడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతీ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో ప్రజానీకం సంక్రాంతిని చేసుకోవడమే మరచారని టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవరప్రసాద్, బొల్లా వెంకట్రావు అన్నారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కూటమి శ్రేణుల ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరుపుకుని మాట్లాడారు.

14న ముగ్గుల పోటీలు

అత్తిలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అత్తిలి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా ఈ నెల 14న మండల స్థాయిలో ముగ్గుల పోటీలు నిర్వహించ నున్నట్లు క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ యాతం రాంబాబు తెలిపారు. ఆసక్తి గల వారు బ్యాంకు వీధిలో గల తన షాప్ వద్ద పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు.



ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

పాలకొల్లు అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే సంక్రాంతి సంబరాల్లో భాగంగా బుధవారం స్థానిక డీలక్స్ రోడ్డులో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. 106 మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. పోటీల కో ఆర్డినేటర్ కర్నేన రోజా రమణి పర్యవేక్షించారు. న్యాయ నిర్ణేతలుగా గాదె శివ కుమారి, లక్కోజు సునీత, గమిని అంజలీ వ్యవహరించారు. విజేతలకు బహుమతులు అందించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

కాళ్ళ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ పరీక్షలు చేయించడం నేరమని, పరీక్షలు చేసినవారు, చేయించుకున్న వారు శిక్షార్హులేనని భీమవరం బార్ అసోసియేషన్ అధ్యక్షులు యేలేటి యోహాన్ తెలిపారు. భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో కాళ్ళ మండలం పెద అమిరం గ్రామంలో డ్వాక్రా భవనంలో బుధవారం ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో న్యాయవాదులు పర్యావరణ పరిరక్షణ, నీటి వనరుల సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు

పాలకొల్లు రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): లోవోల్టేజి సమస్య పరిష్కారానికి 63కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫారంలను ఏర్పాటు చేస్తున్నామని పాలకొల్లు ఎలక్ట్రికల్ డిఈ సీహెచ్.రామకృష్ణ అన్నారు. పాలకొల్లు రూరల్ పరిధిలోని పూలపల్లి శివారు ఈదపేట, గోరింటాడ గ్రామాల్లో లోవోల్టేజి నివారణకు రెండు 63కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫారంలను, కొత్తపేట గ్రామంలో సింగిల్ ఫేస్ ట్రాన్స్ ఫారంలను బుధవారం ఆయన సర్పంచులు, కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. పాలకొల్లు రూరల్ మండల ఎలక్ట్రికల్ ఏఈ లంక శ్రీనివాసరావు, సర్పంచులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న మాండలిన్ కచేరి

భీమవరం టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : భీమవరం త్యాగరాజ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాలు బుధవారం మూడో రోజుకు చేరాయి. ఆర్యవైశ్య వర్తక సంఘం భవనం కార్యదర్శి తటవర్తి బదిరి నారాయణ జ్యోతి ప్రజ్వలన చేశారు. బుధవారం చెన్నైకు చెందిన ప్రముఖ మాండలిన్ వాయిద్య విద్వాంసులు యు. రాజేష్ మాండలిన్ వాదన శ్రోతలను ఉర్రూతలూగించింది. వయొలిన్‌పై బీవీ దుర్గా భవాని (విజయవాడ), మృదంగంతో పీ సతీష్ కుమార్ (చెన్నై), ఘటంతో ఎం. హరిబాబు (గుంటూరు) సహకరించారు. ముందుగా నాట్యాచారిణి అంతర్జాతీయ అవార్డు గ్రహీత భానుశ్రీ భరతనాట్యం అందరినీ ఆకట్టుకుంది. ఆమెకు డా. గంధం విశ్వే శ్వరరావు రూ 10 వేలు నగదు బహుమతిని విద్వాంసుడు రాజేష్ చేతుల మీదుగా అందించారు. ఉద్దరాజు కాశీ విశ్వనాథ రాజు, కారుమూరి ఆదిత్య, చెరుకువాడ వెంకట్రామయ్య, రంగసాయి, కారు మూరి చినబాబు, గంధం విశ్వేశ్వరరావు, మంతెన రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులకు శంకుస్థాపన

పాలకొల్లు అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లాకుల వద్ద నుంచి పూలపల్లి వరకూ ఆర్‌అండ్‌బి రోడ్డు మరమ్మతు పనులను మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ బుధవారం దేశాలమ్మ గుడి వద్ద కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. సందర్భంగా అంగర మాట్లాడుతూ రూ. 19 లక్షలతో ఈ పనులు చేపట్టడం జరిగిందన్నారు. నాయకులు పెచ్చెట్టి బాబు, బోణం చిన బాబు, ఉన్నమట్ల ప్రేమ్‌కుమార్, శిడగం సురేంద్ర, బి లక్ష్మీనారాయణ, టి రామలింగం, ఆర్‌అండ్‌బి డిఈ వివి రమణ, జేఈ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

13,300 ఎకరాల్లో సాగు



వై. రాఘవేంద్రరావు
ఇరగవరం మండల వ్యవసాయ అధికారి

- **దాళ్వాకు అనుకూలమైన వరి విత్తన రకాలేమిటి? ఆయకట్టు ఎంత?**

జవాబు: దాళ్వా సాగుకు స్వల్పకాలిక రకాలైన ఎంటీవి -1121, ఎంటీవి 1153, పీఆర్ 126 అనుకూలం. ఇరగవరం మండలంలో 13,300 ఎకరాల్లో రైతులు దాళ్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు.

- **నారుమడులు, ఊడ్పులు ఎంత శాతం పూర్తయ్యాయి?**

జవాబు: 13,300 ఎకరాలకు గాను 665 ఎకరాల నారుమడి అవసరం కాగా 100 శాతం పూర్తి అయ్యాయి. ప్రస్తుతానికి 3800 ఎకరాల్లో ఊడ్పులు పూర్తయ్యాయి. జనవరి 15 నాటికి ఊడ్పులు పూర్తి కావాలని రైతులకు సూచించాం.

- **దాళ్వా సాగుకు సంబంధించిన పంటల భీమా ఎలా చెల్లించాలి ?**

జవాబు: ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద ఈ నెల 15 వరకు పంటల భీమా చేసేందుకు గడువు పెంచాం.

- **ఎరువులు అందుబాటులో ఉన్నాయా?**

జవాబు: మండలంలోని 10 సొసైటీలలోనూ యూరియా, ప్రైవేట్ డీలర్ల వద్ద అన్ని రకాల ఎరువులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి.

(ఆంధ్రజ్యోతి- ఇరగవరం)

40 మందికి కుట్టు మిషన్ల వితరణ

భీమవరం అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పేద మహిళలు ఆర్థికంగా బలపడేందుకు రాజ్ ట్రస్ట్ అధ్యక్షుడు 40 మంది పేద మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్లను పంపిణీ చేశారు. బుధవారం స్థానిక చినరంగని పాలెం పుంతలో జరిగిన ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్, సీపీఐ నాయకుడు చెల్లబోయిన రంగారావు తదితరులు మాట్లాడుతూ రాజ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా కుట్టుమిషన్లు అందించడం అభినందనీయమన్నారు. న్యాయవాది యేలేటి న్యూటన్, కాపునాడు రాష్ట్ర నాయకుడు గిద్దా శ్రీనివాస్ నాయుడు, ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు తోరం రాజు, పి. ఆనంద్, ఎస్. మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి రూ.50 వేలు ఆర్థిక సాయం

గణపవరం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బవాయిపాలెం గ్రామానికి చెందిన బీటెక్ మైక్రోసాఫ్ట్ ఇంజనీరింగ్ విద్యార్థి సుధాకర్‌కు రూ.50వేలు చెక్కును లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ ఈపూరి సత్యనారాయణ బుధవారం అందజేశారు. లయన్స్‌క్లబ్ సభ్యుల సహకారంతో ఈ ఆర్థిక సాయం అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు పచ్చిపులుసు నాగేశ్వరరావు, కోశాధికారి విశారద, జిల్లా లయన్స్‌క్లబ్ నాయకులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

పెంటపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఇన్‌చార్జి డీఎల్‌పీవో చీకట్ల బాలాజీ వెంకటరమణ, ఇన్‌చార్జి ఏపీడీ ఏవీవీ ప్రసాద్ అన్నారు. బుధవారం మండల సమాఖ్య కార్యాలయంలో పెంటపాడు, గణపవరం మండలాల ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌లకు విధులు, బాధ్యతలపై శిక్షణ ఇచ్చారు. అర్హులకు జాబ్‌కార్డులు ఇవ్వాలన్నారు. టీఏలు రామకృష్ణారెడ్డి, సురేంద్ర పాల్గొన్నారు.



కళాక్షేత్రం పనులు పునఃప్రారంభం

పాలకొల్లు టౌన్, జనవరి8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో బొండాడ వెంకట రాజు గుప్త, ఎన్టీఆర్ కళాక్షేత్రం పనులు మంత్రి రామానాయుడు చొరవతో పునఃప్రారంభమైనట్టు కమిషనర్ విజయసారథి తెలిపారు. ఇటీవల మంత్రి పి నారాయణ పట్టణ పర్యటన సందర్భంగా రూ. 5 కోట్లు మంజూరు చేయడంతో ఐదేళ్ళుగా నిలిచిన పనులను పునఃప్రారంభిస్తున్నట్టు తెలిపారు. కళాక్షేత్రం సీలింగ్, ఏసీ, ఎలక్ట్రిసిటీ ఇంజనీర్లు, కర్టెన్ సిస్టం ప్రతినిధులతో సమీక్షించి ఈ పనులు త్వరితంగా పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కళాక్షేత్రాన్ని వారు పరిశీలించారు.